## రెవెన్యూ అలసత్వంతో
# రగిలిన 'ఆళ్ళపల్లి'!

**రూ. కోట్ల విలువైన 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ**

- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- నేడు ఆఆర్‌డీవో వద్ద పంచాయితీ



6

నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఖమ్మం - వరంగల్ - నల్గొండ
శనివారం, 15 ఆగస్టు 2026




# సర్వే పేరుతో హడావుడి..
# రిపోర్ట్‌పై లేని సడి

## చేపల చెరువుల సర్వే చేసి 12 రోజులైనా లెక్క తేలలేదా!?

- ఫారెస్ట్ భూమిలో అనుమతి లేని చెరువుల ఆరోపణలు..
- నిర్ధారణపై అధికారుల మౌనరాగం ఎందుకో..
- ఫారెస్ట్ భూమి అయితే చర్యలు ఎక్కడ?
- 'నినాదం' ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు?

అక్రమ చేపల చెరువుల వ్యవహారంలో అధికారులు చేపట్టిన సర్వేకు 12 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు అసలు ఏం తేల్చారన్నది మాత్రం సడిసప్పుడు లేకుండా ప్రశ్నార్థకంగానే మిగిలింది. సర్వే పూర్తయిందా? ఎంత విస్తీర్ణంలో చెరువులు ఉన్నాయి ? అవి ఫారెస్ట్ భూములా ? చెరువులకు అనుమతులు ఉన్నాయా ? అక్రమంగా చేపల పెంపకం సాగిస్తున్నది ఎవరు ? అనే కీలక ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. "అక్రమ చేపల చెరువులు తొలగించాలి.. ఫారెస్ట్ భూములను కాపాడాలి" అంటూ నినాదం ఫోకస్ చేసిన అంశం ఇప్పుడు అధికార యంత్రాంగం తీరుపై మరోసారి చర్చకు దారితీస్తోంది. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన తర్వాత అధికారులు హడావుడిగా సర్వే నిర్వహించినప్పటికీ.. సర్వే అనంతరం ఎలాంటి నిర్ధారణకు వచ్చారో, ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించకపోవడం విమర్శలకు కారణమవుతోంది.

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 13 (నినాదం):

వార్త మెయిన్‌లో

## ఏజెన్సీ భూమి పేరుతో
# బ్లాక్‌మెయిల్ దందా..!



- మహిళకు బెదిరింపులు
- రూ. 2 లక్షలు డిమాండ్ చేసిన దమ్మపేట రిపోర్టర్
- బెదిరించి 50 వేలు ఫోన్‌పే చేయించుకున్న వైనం
- మిగతా సొమ్ము కోసం వేధింపులు..తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించిన సదరు మహిళా...
- రిపోర్టర్ సాయి ప్రసాద్ శాస్త్రిపై దమ్మపేట పోలీసుల యాక్షన్.. ఎఫ్ఐఆర్ నమోదు

2

కష్టపడి కొనుక్కున్న భూమికి పాస్‌బుక్ వచ్చిందన్న సంతోషం ఆ కుటుంబంలో ఎంతో కాలం నిలవలేదు. "ఏజెన్సీ ప్రాంతంలో భూమి ఎలా కొంటారు? మీ అంతు చూస్తా.. పత్రికలో వార్తలు రాసి పరువు తీస్తా" అంటూ ఓ పత్రికా విలేఖరి సదరు మహిళను భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ బెదిరింపులకు భయపడి బాధితురాలు విడతలవారీగా రూ. 50,000 ఫోన్‌పే చేసినా సదరు విలేఖరి వేధింపులు ఆపలేదు. చివరకు తట్టుకోలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.

దమ్మపేట, ఆగస్టు 14(నినాదం)



3

## రజనీకాంత్ ప్రతిభ అదుర్స్..
**చాక్ పీస్ పై త్రివర్ణ పతాక నిర్మాణం**

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా నాణ్యమైన
## వైద్య సేవలు అందేలా పనిచేయాలి
**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



7

## కానిస్టేబులే కడతేర్చాడు

- వీడిన దంపతుల హత్య మిస్టరీ
- అప్పు చెల్లించకపోవడంతో దారుణం
- సీసీటీవీ ఫుటేజ్ సాంకేతిక ఆధారాలతో నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ

4



# ఏజెన్సీ భూమి పేరుతో బ్లాక్ మెయిల్ దందా..!

- మహిళకు బెదిరింపులు
- రూ. 2 లక్షలు డిమాండ్ చేసిన దమ్మపేట రిపోర్టర్
- బెదిరించి 50 వేలు ఫోన్‌పే చేయించుకున్న వైనం
- మిగతా సొమ్ము కోసం వేధింపులు.. తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించిన సదరు మహిళ
- రిపోర్టర్ సాయి ప్రసాద్ శాస్త్రిపై దమ్మపేట పోలీసుల యాక్షన్
- ఎఫ్ఐఆర్ నమోదు

**దమ్మపేట, ఆగష్టు 14(నినాదం):**

**కష్టపడి కొనుక్కున్న భూమికి పాస్‌బుక్ వచ్చిందన్న సంతోషం ఆ కుటుంబంలో ఎంతో కాలం నిలవలేదు. "ఏజెన్సీ ప్రాంతంలో భూమి ఎలా కొంటారు? మీ అంతు చూస్తా.. పత్రికలో వార్తలు రాసి పరువు తీస్తా" అంటూ ఓ పత్రికా విలేఖరి సదరు మహిళను భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ బెదిరింపులకు భయపడి బాధితురాలు విడతలవారీగా రూ. 50,000 ఫోన్‌పే చేసినా సదరు విలేఖరి వేధింపులు ఆపలేదు. చివరకు తట్టుకోలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. దమ్మపేట మండలంలో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.**

**భూమి కొంటే బెదిరింపులు..**

మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన ధార మల్లీశ్వరి అనే మహిళ.. కోటగిరి కృష్ణ అనే వ్యక్తి వద్ద నుండి కొంత వ్యవసాయ భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్ కూడా ఆమె పేరు మీదికి బదిలీ అయింది. అంతా సజావుగానే సాగుతుందనుకున్న సమయంలో, దమ్మపేట మండలానికి చెందిన నవతెలంగాణ పత్రిక విలేఖరి సాయి ప్రసాద్ శాస్త్రి కన్ను ఆ భూమిపై పడింది. బాధితురాలికి ఫోన్ చేసిన ఆయన.. "ఏజెన్సీ ఏరియాలో చట్టాన్ని ఉల్లంఘించి భూమిని ఎలా కొనుగోలు చేస్తారు? మీకు పాస్‌బుక్ ఎలా ఇస్తారు?" అంటూ అధికార స్వరంతో బెదిరింపులకు దిగాడు.

**రూ. 2 లక్షలు ఇస్తేనే వదిలేస్తా!**

ఈ వ్యవహారంపై పత్రికలో పెద్ద ఎత్తున తప్పుడు వార్తలు రాస్తానని, మిమ్మల్ని సర్కారు చుట్టూ తిరిగేలా చేస్తానని శాస్త్రి హెచ్చరించాడు. ఈ లొసుగుల నుంచి తప్పించుకోవాలన్నా, పత్రికలో వార్త రాకుండా ఉండాలన్నా తనకు రూ. 2 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని, మీ అంతు చూస్తానని ఘాటుగా బెదిరించాడు. సదరు విలేఖరి ఆవేశాన్ని, బెదిరింపులను చూసి తీవ్ర ఆందోళనకు గురైన మల్లీశ్వరి.. గత్యంతరం లేక ప్రాథమికంగా ఆయన చెప్పిన నంబర్‌కు ఫోన్‌పే (ఫోన్ పే) ద్వారా రూ. 50,000 బదిలీ చేసింది. మిగిలిన డబ్బుల కోసం కూడా సదరు విలేఖరి ఒత్తిడి తెస్తూ, మానసిక వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు తీవ్ర భయాందోళనకు లోనైంది.

**పోలీసుల రంగప్రవేశం..**

సదరు విలేఖరి వేధింపులు మితిమీరడంతో, బాధితురాలు ధార మల్లీశ్వరి చివరకు ధైర్యం చేసి దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. విలేఖరి సాయి ప్రసాద్ శాస్త్రి తనను డబ్బుల కోసం ఎలా వేధించాడో, ఫోన్‌పే ద్వారా నగదు ఎలా వసూలు చేశాడో పోలీసులకు వివరించింది. బాధితురాలి ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన దమ్మపేట పోలీసులు.. సదరు విలేఖరిపై బెదిరింపులు, అక్రమ వసూళ్ల సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు పూర్తి ఆధారాలతో దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు. ముసుగులో ఉండి ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**సూత్రధారులు ఎవరు?.. 'బడా బాబుల' గుండెల్లో రైళ్లు!**

కాగా, ఈ భూమి బ్లాక్‌మెయిల్ దందా వెనుక కేవలం సాయి శాస్త్రి ఒక్కడే లేడని, అతని వెనుక కొందరు రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన 'బడా బాబులు', కీలక సూత్రధారుల హస్తం కూడా ఉన్నట్లు మండలంలో తీవ్ర ప్రచారం జరుగుతోంది. విలేకరిని ముందు పెట్టి వెనుక ఉండి నడిపిస్తున్న ఆ పెద్ద మనుషులు ఎవరు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి పేర్లు కూడా త్వరలోనే బయటకు వచ్చే అవకాశం ఉండటంతో ఆ 'బడా బాబుల' గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఈ అక్రమ వసూళ్ల ముఠా మొత్తాన్ని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి ముప్పు

**అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు**

**వైరా, ఆగష్టు 14 (నినాదం):**

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి ముప్పు ఉందని అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం దివంగత రైతాంగ ఉద్యమ నాయకుడు నర్వనేని సత్యనారాయణ 5వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం) వైరా మండల కమిటీ ఆధ్వర్యంలో ముసలిమడుగు గ్రామంలో "భారత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు -- వ్యవసాయ రంగంపై ప్రభావం" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య వక్తగా హాజరైన ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయ రంగంపై దీర్ఘకాలిక చెడు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశీయ రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు మార్గం సుగమం చేస్తే, తక్కువ ధరలకు విదేశీ ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ ధరల భారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులతో దేశీయ రైతులు పోటీ పడాల్సి వస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించక వ్యవసాయం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకు ఉండాలని, మార్కెట్‌లో రైతు రక్షణకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కేవలం మార్కెట్ సరుకుగా చూడకుండా దేశ ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాల్సిన అవసరం



ఉందన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై పారదర్శకమైన చర్చ జరగాలని, వాటి వల్ల ఏఏ పంటలపై , ఏఏ ప్రాంతాల రైతులపై, ఏ విధమైన ప్రభావం ఉంటుందనే విషయాలను ప్రజలకు ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. దేశీయ రైతులకు రక్షణ కల్పించే విధానాలు రూపొందించకుండా అంతర్జాతీయ మార్కెట్ పోటీకి రైతులను వదిలేయడం సరికాదన్నారు. సెమినార్ లో ప్రారంభం ఉపన్యాసం చేసిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు కనీస మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, చౌకైన వ్యవసాయ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విషయంలో దేశీయ రైతుల ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై నిరంతర అధ్యయనం, ప్రజల్లో అవగాహన, ఉద్యమ నిర్మాణం ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురాగలమని పేర్కొన్నారు. అనంతరం సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కామ్రేడ్ నర్వనేని సత్యనారాయణ జీవితాంతం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ, తాను తెలుసుకున్న విషయాలను ప్రజా ఉద్యమాలకు అనుసంధానం చేసిన అధ్యయనశీలి, ఆచరణవాదని గుర్తుచేశారు. ఆయన ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై అధ్యయనం చేసి ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత కమ్యూనిస్టు ఉద్యమంపై ఉందన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం రైతుల సమస్యలు కాదని, అవి దేశ ఆహార భద్రతకు, గ్రామీణ ప్రజల జీవనానికి, మొత్తం సమాజ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవని తెలిపారు. అందువల్ల వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు విస్తృత ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. తొలుత నర్వనేని సత్యనారాయణ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ వైరా రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో నర్వనేని సత్యనారాయణ చిత్రపటానికి నర్వనేని కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, కుందనపు నరేంద్ర, నర్వనేని సత్యనారాయణ భార్యా నర్వనేని పద్మావతి, కుమారులు నర్వనేని వెంకటరావు, నర్వనేని శ్రీనివాసరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు,సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, వందల సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్

**కోతుల బెడదకు చెక్.. 105కుపైగా కోతుల పట్టివేత**

**లక్ష్మీదేవిపల్లి ఆగష్టు 14 (నినాదం):**

శ్రీనగర్ కాలనీ ప్రజలను కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడదకు ఎట్టకేలకు పరిష్కారం లభిస్తోంది. ప్రజల సమస్యను గుర్తించి కోతులను పట్టించే కార్యక్రమం చేపట్టిన శ్రీనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ రాణి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న కార్యక్రమంలో మొదటి రోజు 55కు పైగా, రెండో రోజు సుమారు 50 కోతులు.. మొత్తం 105కుపైగా కోతులను పట్టించినట్లు సర్పంచ్ బానోత్ రాణి, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. మిగిలిన కోతులను కూడా పట్టించి ప్రజలకు పూర్తి స్థాయిలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పట్టుకున్న కోతులను అడవి ప్రాంతాలకు తరలించే కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ రాణి, ఉప సర్పంచ్ కేశవరావు, కార్యదర్శి వంశీకృష్ణ, 12వ వార్డు సభ్యుడు ఖదీర్ పాషా, 2వ వార్డు సభ్యురాలు గూగుల్ రాధికతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు. కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని పంచాయతీ ప్రతినిధులు తెలిపారు.



## రూ.44 లక్షలతో అభివృద్ధికి బాటలు..!

**కప్పలబంధంలో సీసీ రోడ్లకు కౌన్సిలర్ బీరవెల్లి మాధవ్ శ్రీకారం**

**కల్లూరు, ఆగష్టు 14(నినాదం):**

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కల్లూరు మున్సిపాలిటీ 2వ వార్డులో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. 2వ వార్డు కౌన్సిలర్ బీరవెల్లి మాధవ్ ఆధ్వర్యంలో కప్పలబంధంలో రూ.44 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. వార్డులో రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణంతో రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వర్షా కాలంలో బురద, గుంతల సమస్యలకు చెక్ పడనుంది.ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో ముందుండేలా కౌన్సిలర్ బీరవెల్లి మాధవ్ చర్యలు చేపడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ జిల్లేళ్ల స్వాతి బాస్కర్‌రెడ్డి, తేళ్లూరి సత్యం, తేళ్లూరి లాలయ్య, గురవయ్య, రమణ, మోదుగు నాగేశ్వరరావు, తేళ్లూరి రవి, మోదుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## నూతన బేకరీని ప్రారంభించిన సర్పంచ్

**తల్లాడ, ఆగష్టు 14 (నినాదం)**

తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌వీ బెంగళూరు బేకరీని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ఆర్. రమేష్ తల్లాడలో బేకరీ ఏర్పాటు చేయడంఅభినందనీయమన్నారు. వివిధ రకాల స్వీట్లు, కేకులు, బేకరీ ఉత్పత్తులను నాణ్యతతో పాటు సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. తల్లాడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బేకరీ నిర్వాహకులు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కోడూరు నాగేశ్వరరావు, మొక్క సత్యనారాయణతో పాటు మిత్రులు, బంధువులు, స్థానికులు పాల్గొన్నారు.



## ఉపసర్పంచ్‌కు బీఆర్ఎస్ నేతల పరామర్శ

**కల్లూరు, ఆగస్టు 14, (నినాదం)**

ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న యజ్ఞనారాయణపురం ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్ రావి సూర్యనారాయణను పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు సూర్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెప్పి, ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పువ్వాల శ్రీధర్‌బాబు, కట్టా బాబు, సూదా వెంకటయ్య, నున్నా రామారావు, తూదెడ్డి మారేశ్వరరావు, నర్సింహారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నేత్ర కంటి హాస్పిటల్ ఘనంగా ప్రారంభోత్సవం

**డోర్నకల్ /మరిపెడ ఆగస్టు 14 (నినాదం)**

కళ్ళను జాగ్రత్తగా చూసుకుంటేనే ప్రపంచాన్ని చూడగలమని ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ అన్నారు. ɹహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కార్గిల్ సెంటర్ లో శ్రీ నేత్ర కంటి ఆసుపత్రి మరియు ఆప్టికల్స్ ను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ ప్రారంభించారు. వైద్య వృత్తి ఎంతో గొప్పదని,ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వైద్యం చేసి మంచి పేరును సంపాదించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుగులోతు రవి నాయక్,చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు రాంలాల్,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు గంధసిరి బిక్షపతి, బాలాజీ, లింగయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ జెండాతో ఎంజెపి ఎన్ సి సి క్యాడేట్ల ర్యాలీ

**కమలాపూర్, ఆగస్టు 14 (నినాదం)**

మహాత్మా జ్యోతి భాపులే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడేట్లు 50 మీటర్ల పొడవున్న జాతీయ జెండాతో హర్ ఘర్ తీరంగా ఘర్ ఘర్ తిరంగా జెండా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల నుంచి కమలాపూర్ లోని గూడురు క్రాస్ రోడ్డు చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఒక్కో విద్యార్థి జాతీయ జెండా చేత పట్టి దేశ భక్తిప్రజ్జ్వరిల్లెలా ప్రతిధ్వనిశీచారు. తిరంగా ర్యాలీలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డా రవీందర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, ఎన్ సీసీ ఏఎన్ఓ విజయ్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కౌశిక్‌రెడ్డికి లేదు

**కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన డాక్టర్ మట్టా దయానంద్**



**సత్తుపల్లి, ఆగస్టు 14 (నినాదం)**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన విమర్శలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయా నంద్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భం గా డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ.. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కౌశిక్‌రెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వతహాగా కాంట్రాక్ట్ పనులు చేస్తూ ప్రజల మధ్య నుంచి ఎదిగిన నాయకుడని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో ఆ పార్టీ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పదవులు ఇస్తామని హామీలు ఇచ్చి నాయకులను మోసం చేశారని విమర్శించారు. కుటుంబానికే పదవులు కట్టబెట్టడం వల్లే ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి ప్రజాదరణ కలిగిన నాయకులను దూరం చేసుకోవడం వల్లే బీఆర్ఎస్ ఘోర పరాజయాన్ని చవిచూసిందని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతోనే కాంగ్రెస్ నాయకులు విజయం సాధించారని, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే కొనసాగుతుందని డాక్టర్ మట్టా దయానంద్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పొంగులేటిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి**



**తల్లాడ, ఆగస్టు 14 (నినాదం)**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని కౌశిక్‌రెడ్డికి సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడాలని, ఆయనపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా దీటైన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని లక్ష్మారెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వయస్సులో పెద్దలను గౌరవించే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని, కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచే సేవా మనస్తత్వం ఆయనకు ఉందని పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. కౌశిక్‌రెడ్డి సమయం, తేదీ ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీ తరఫున చర్చకు సిద్ధమని తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల సంఖ్య, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యపై బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎవరికి అనుకూలమో స్పష్టం చేస్తుందని గొడుగునూరు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మరోసారి కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజకీయంగా దీటైన సమాధానం ఇస్తామని తెలిపారు.

# సాగుకు సాగర్ నీటిని విడుదల చేయకుంటే రైతుల తిరుగుబాటు తప్పదు

**యాగం చేసింద్రు చుక్క వర్షం రావట్లేదు**

**-మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు**




**మిర్యాలగూడ, ఆగస్టు 14( నినాదం ):**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి ఎడమ కాల్వకు వానాకాలం సాగునీటిని వెంటనే విడుదల చేయాలని ఎడల రైతుల నుండి తిరుగుబాటు తప్పదని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి అన్ని డ్యాంలు నిండుగా ఉన్నాయని, శ్రీశైలం ప్రాజెక్టులో 872 అడుగుల నీరు ఉందని, మరో ఏడు అడుగులు అయితే ప్రాజెక్టు నిండుతుందని, ఈ దశలో అక్కడ విద్యుత్ తయారు చేసి సాగర్ ప్రాజెక్టుకు వదిలినట్లయితే ఆ నీటితో ఎడమ కాల్వకు రెండు పంటలకు నీటి విడుదల చేయవచ్చన్నారు. అదే విధంగా తాగునీటికి కూడా కొరత ఉండదని తెలిపారు. నీటి పారుదల శాఖ మంత్రి జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నా కూడా నీటి విడుదలపై నోరు మెదపడం లేదని, అదే ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, భట్టి విక్రమార్కతో పాటు నల్లగొండ జిల్లా ఆయకట్టు పరిధిలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్ఆర్, పద్మావతి ఉన్నారని, సాగునీటిపై వీరు ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో ఏర్పడింది, నీటి కొరత ఉంటుందని అవగాహన లేకుండా శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ తయారీని నిలిపి వేశారని, నీటి విడుదల విషయంలో నిర్లక్ష్యం చేస్తే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సాగునీటి విడుదలపై సలహాలు స్వీకరించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి విడుదల చేయనట్లయితే రైతులతో కలిసి ఛలో సాగర్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ డ్డి, హాతీరాం, అన్నభీమోజు నాగార్జునచారి, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పడిగపాటి కోటిరెడ్డి, ఎండి. యూసుఫ్, ఇలియాస్, పాచ్చునాయక్, వినోద్, రవీందర్, షోయబ్, పద్మావతి, రమాదేవి ఉన్నారు.

## పోలీస్ కర్తవ్య నిర్వహణలో ప్రతిభ..

**ఎస్ఐ రాజేష్ కుమార్‌కు జిల్లా ఎస్పీ అభినందనలు...**



**దమ్మపేట, ఆగష్టు 14(నినాదం):**

విధుల పట్ల అంకితభావం, కేసుల ఛేదనలో చాకచక్యం ప్రదర్శించిన దమ్మపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) బందం రాజేష్ కుమార్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ప్రాంతంలో కలకలం రేపిన ఓ చైన్ స్నాచింగ్ కేసును ఎస్ఐ రాజేష్ కుమార్ అత్యంత ప్రతిభావంతంగా దర్యాప్తు చేసి, నిందితులను చురుగ్గా పట్టుకున్నారు. ఎస్ఐ చూపిన ఈ సమర్థతను గుర్తిస్తూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో ఆయనకు ఘనంగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడం, కేసుల పరిష్కారంలో నిబద్ధతతో చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగిస్తూ పోలీస్ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ రాజేష్ కుమార్‌కు తోటి పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్‌కే జానీని పరామర్శించిన టీజీఐడీసీ చైర్మన్ మువ్వా



**సత్తుపల్లి, ఆగస్టు 14 (నినాదం)**

సత్తుపల్లి పట్టణంలోని కల్పతారు రోడ్ 4వ వార్డులో నివాసం ఉంటున్న ఎస్‌కే దస్తగిరి తండ్రి ఎస్‌కే జానీ అనారోగ్యంతో బాధపడు తున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర టీజీఐడీసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయబాబు ఆయనను పరామర్శించారు ఈ సందర్భంగా జానీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మువ్వా విజయబాబు, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అవస రమైన సమయంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తా మని భరోసా ఇచ్చారు. మువ్వా విజయబాబు తమను పరామర్శించి ధైర్యం చెప్పడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకు లు, కార్యకర్తలు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మువ్వా విజయబాబు అభిమానులు పాల్గొన్నారు.

## రజనీకాంత్ ప్రతిభ అదుర్స్...

**చాక్ పీస్ పై త్రివర్ణ పతాక నిర్మాణం**



**కాటారం, ఆగష్టు 14(నినాదం):**

కాటారం కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ తన అరుదైన ప్రతిభతో అబ్బురపరుస్తున్నాడు. సందర్భానికి అనుగుణంగా చాక్ పీస్, బియ్యపు గింజలపై అతి సూక్ష్మ నిర్మాణాలు చేస్తూ అదుర్స్ అనిపించుకుంటున్నాడు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చాక్ పీస్ ముక్కపై 2.6 సెంటీమీటర్ల ఎత్తు ఒక సెంటీమీటర్ వెడల్పు ఉన్నటువంటి జాతీయ జెండాను సుమారు మూడు గంటల పాటు శ్రమించి తయారు చేశారు. అదేవిధంగా 6 మిల్లీమీటర్ల ఎత్తు 4 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్నటువంటి హ్యాపీ ఇండిపెండెన్స్ డే ఆంగ్ల అక్షరాలను సుమారు గంట పాటు కష్టపడి రూపొందించారు. అంతేకాకుండా 1.5 సెంటీమీటర్ల ఎత్తు ఉన్నటువంటి నాలుగు జాతీయ పతాకాలను, ఐ లవ్ ఇండియా అనే అక్షరాలను సుమారు గంటన్నర పాటు శ్రమించి గుండు పిన్ను సాయంతో స్కల్ప్చరింగ్ ఆర్ట్ ద్వారా తయారుచేసి ప్రజలకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ ఇంతకుముందు ప్రపంచంలోనే అతి చిన్న జాతీయ పతాకాన్ని నాలుగు మిల్లీమీటర్ల ఎత్తుతో చెక్కి క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించాడు. బియ్యపు గింజలపై భారత జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం అక్షరాలను రాసి కూడా వివిధ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. మైక్రో ఆర్ట్ లో ప్రతిభ కనబరుస్తున్న రజనీకాంత్ ను కళాశాల ప్రిన్సిపల్ సోమోజీ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య అభినందించారు.





## కౌనిక్ వర్దన్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**కమలాపూర్ ,ఆగస్టు 14 (నినాదం)**
మండలం లోని వంగపల్లి గ్రామానికి చెందిన దేవరాజు కౌనిక్ వర్దన్ ఇటలీలో జరిగిన షైలింగ్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని 13వ స్థానంలో నిలిచిన సందర్భంగా శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వంగపల్లి గ్రామ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం దేవరాజు కౌనిక్ వర్దన్ ను సాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసలా శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమార స్వామి, వార్డు సభ్యులు ఎలుకటి. అనిల్, ఎలుకటి వనిత అశోక్, గ్రామ సీని యర్ నాయకులు ఆకునూరి సాంబయ్య, చిలువేరి రవీందర్, ఎం డి అంజాద్, ఉడుత. సాయి కృష్ణ, ఐలయ్య, పర్నరా ములు, పుల్ల శోభన్ బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## 112పై యువత ప్రచారం

**కోదాడ,ఆగస్టు 14(నినాదం):**
అత్యవసర సేవల కోసం 112 నంబర్‌పై అవగాహన కల్పించేందుకు పాత గోల్‌తండా యువకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.'100 డయల్ కాదు.. 112' పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఎస్సై ఏడుకొండలు శుక్రవారం ఆవిష్కరించారు. పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలకు ఒకే నంబర్ 112కు కాల్ చేయా లని ఎస్సై సూచించారు. ప్రజలకు అవగా హన కల్పించేందుకు యువకులు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌పీఎల్ కప్ హుజూర్‌నగర్ క్యాంప్ హైస్కూల్‌దే

**హుజుర్నగర్, ఆగస్టు 14 (నినాదం ):**
విద్యార్థి దశలో క్రీడలు ఎంతో ముఖ్యమని, క్రీడలతో చురుకుదనం, ప్రజ్ఞతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హుజూర్‌నగర్ స్థాయిలో తొలిసారిగా నిర్వహించిన హుజూర్‌నగర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజేతలకు హెచ్‌పీఎల్ కప్‌ను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల స్థాయిలో యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ కోచ్ ప్రవీణ్ కుమార్ చౌరవతో వారం రోజులపాటు హెచ్‌పీఎల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ ఎన్ఎస్పీ క్యాంప్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. హెచ్‌పీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా చరిత్ర సృష్టించారు.



ద్వితీయ బహుమతిని గ్రీన్‌వుడ్ స్కూల్ విద్యార్థులు దక్కించుకున్నారు. హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎన్ఎస్పీ క్యాంప్ హైస్కూల్ విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఆశా సతీష్, క్యాంప్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ మహబూబ్ జాన్, క్రికెట్ కోచ్ దేవిశెట్టి రవి, వేముల శ్రీనివాస్, కె.వి. సత్యనారాయణతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రజల భద్రతకు సాంకేతికత.. మహిళల

# ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**రామలింగంపల్లిలో సీసీ కెమెరాలు, మహిళా సంఘం భవనం ప్రారంభం**

**ఆలేరు, ఆగస్టు 14(నినాదం):**
యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గ్రామం లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థతో పాటు నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం తో పాటు అసాంఘిక కార్యకలా పాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ గ్రామ భద్రతలో భాగస్వాములు కావాలని సూచించారు. మహిళా సంఘాలకు వేదికగా భవనం అదే విధంగా గ్రామంలో నిర్మించిన మహిళా సంఘం భవనం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సమావేశాలతో పాటు



మహిళలకు ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనం దోహదపడుతుందని చెప్పారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకు ని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బీర్ల ఐలయ్య ఆకాంక్షించారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల భద్రత, మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వివిధ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## తల్లాడలో నూతన ఆసరా పింఛన్ల ఎంపికపై అవగాహన సదస్సు

**తల్లాడ, ఆగస్టు 14 (నినాదం)**
రాష్ట్రంలో నూతన ఆసరా పింఛన్‌దారుల ఎంపిక ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం తల్లాడ రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వి సి కార్యక్రమానికి తల్లాడ మండల ఎంపీడీవో శ్రీధర్ రాజు ఎంపీవో శ్రీహరి మండలంలోని గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆసరా పింఛన్ల ఎంపిక కు సంబంధించిన మార్గదర్శకాలు, అర్హతలు, దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదా రుల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించా రు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శ కంగా అందేలా ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. కార్యక్ర మంలో తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, తెలగారం సర్పంచ్ భూక్యా కాళోజీ, మంగాపురం సర్పంచ్ దుగ్గిదేవర. నరసింహ రావు, కలకొడిమ సర్పంచ్ తాత సుమతి బాయి, కుర్నవల్లి సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మతో పాటు పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెద్దగొల్లగూడెం కాంగ్రెస్ గ్రామ కమిటీ సెక్రెటరీగా చల్లం విశ్వనాథం

**శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ మండల నాయకులు నాగేంద్ర..**

**దమ్మపేట, ఆగస్టు 14(నినాదం):**
మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ కమిటీలో నూతన ఉత్తేజం నింపేలా కమిటీ విస్తరణ గురువారం జరిగింది. ఈ నేపథ్యంలో పెద్దగొల్లగూడెం కాంగ్రెస్ గ్రామ కమిటీ సెక్రెటరీ (కార్యదర్శి) గా చల్లం విశ్వనాథం నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన చల్లం విశ్వనాథంను మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు అన్నవరపు నాగేంద్ర ఘనంగా శాలువా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నవరపు నాగేంద్ర మాట్లాడుతూ.. విశ్వనాథం నాయకత్వంలో పెద్దగొల్లగూడెంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ విశ్వనాథంకు అభినందనలు తెలిపారు.



# కానిస్టేబులే కడతేర్చాడు

- వీడిన దంపతుల హత్య మిస్టరీ
- అప్పు చెల్లించకపోవడంతో దారుణం
- సీసీటీవీ ఫుటేజ్ సాంకేతిక ఆధారాలతో నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 14( నినాదం)**
సూర్యాపేట జిల్లా మోతె మండలంలో భార్య భర్తల హత్య కేసును జిల్లా పోలీసులు 24 గంటలలోనే చేదించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ వివరాలను వెల్లడించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సిఐ రామకృష్ణారెడ్డి సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏ. 2 నిందితుడు జిల్లేపల్లి సుందర్ స్టేషన్లో పంచాయతీలు చేస్తూ ఎండి షరీఫ్ కు పరిచయం కాగా హత్యకు గురైన నాగులు భూబా దంపతులకు ఏ. 1 నిందితుడు షరీఫ్ ను పరిచయం చేయగా సుందర్ పై నమ్మకంతో మూడు లక్షల రూపాయల నగదును అప్పుగా ఇచ్చాడు. హత్య జరిగిన పరిసర ప్రాంతాల సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా ఎ 2నిందితుడు సుందర్ మృతి చెందిన భూభాను తీసుకు వెళుతూ అనుమానాస్పదంగా కనిపించడంతో దర్యాప్తు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు షరీఫ్ ను శు క్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అప్పుగా తీసుకున్న మూడు లక్షల రూపాయల నగదును చెల్లించమని అడగగా భూబా నాగు దంపతులు బెదిరిస్తూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తామని బెదిరించడంతో ఎలాగైనా సరే హత్య చేయాలని పథకం ప్రకారం బ్యాంకు లోను ఇప్పిస్తానని అందులో భాగంగా పొలం వద్ద గొర్రెలను మేకలను కాస్తూ ఫోటోలు దిగాలని చెప్పి పథకం ప్రకారం మొదటగా భర్త నాగును వ్యవసాయ పొలం దగ్గరకు తీసుకువెళ్లి గుంట తీయమని చెప్పి అక్కడే ఉన్న రాడ్డుతో విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. భర్తను పూడ్చిపెట్టిన అనంతరం నిందితుడు షరీఫ్ భూభాను బైక్ పై తీసుకువెళ్లగా అనుమానం వచ్చిన బూబా కేకలు వేయగా ఆమెను సైతం హతమార్చి పాతిపెట్టినట్లు నిందితులు తెలిపారని అన్నారు చట్ట ప్రకారం నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. కేసులు చేదించడంలో కృషిచేసిన సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్ మోతె ఎస్సై అచ్చిరెడ్డి ఎస్ఐలు సాయిరాం హరికృష్ణ సిసిఎస్ సిబ్బందిని అభినందించారు.



## పేద విద్యార్థులకు రాంరెడ్డి ఆర్థిక సాయం

**తొర్రూరు, ఆగస్టు 14 (నినాదం):**
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో దోపతి సరోజన ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె భర్త రాంరెడ్డి ఆధ్వర్యంలో శు క్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాలకుర్తి మండలం నారబోయిన గూడెం గ్రామానికి చెందిన దోపతి సరోజన జ్ఞాపకార్థం నిరుపే దలు, పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం, నిత్యావ సర సరుకులు, పండ్లు పంపిణీ చేపట్టారు. పట్టణంలోని సెయింట్ పాల్ స్కూల్ లోని స్నేహ నివాస్ విద్యార్థులకు రూ.20 వేలు, మదర్సాలో విద్యన భ్యసిస్తున్న పేద విద్యార్థులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజే శారు. అనంతరం పెద్దముప్పారం గ్రామంలోని అమ్మ ఒడి ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేసి రూ . 5వేల ఆర్థిక సాయం అందజేశారు. సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు సహాయం అందించడం పట్ల ఆశ్రమ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దోపతి రాంరెడ్డి మాట్లాడుతూ తన భార్య దోపతి సరోజన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పండ్లు, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహా యం అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద విద్యార్థు చదువుకు తోడ్పాటు అందించడం, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం ద్వారా తన భార్య జ్ఞాపకా లను చిరస్థాయిగా నిలుపుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సి పల్ వైస్ చైర్మన్ సోమ రజని రాజశేఖర్, రాకేష్ రెడ్డి, కుమార్, మహమ్మద్ అమీర్, అలీం తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**క్రిస్టిపాటి అంజిరెడ్డి**

**పాలకవీడు,ఆగస్టు 13(నినాదం):** : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలకవీడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ క్రిస్టిపాటి అంజిరెడ్డి మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీకి నీటిని తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడాలని, రైతుల పంటలు ఎండిపోకుండా తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల తో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ యాద్రెడ్ల సత్యనారాయణరెడ్డి, సర్పంచులు గణపతిరెడ్డి, మందుల నాగయ్య, ఉపసర్పంచ్ సక్రునాయక్, పసుపులేటి సైదులు, హరినాయక్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఆగస్టు 16న రక్తదాన శిబిరం

**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 14 (నినాదం):** ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడేందుకు యువత ముందుకు రావాలని యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ కొత్తగూడెం శాఖ కార్యదర్శి, సీనియర్ లయన్ కోనేరు పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. ఆగస్టు 16వ తేదీ ఆదివారం ఉదయం 8:30 గ.కు కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని కోనేరు పూర్ణచంద్రరావు నివాసంలో రక్తదాన శిబిరం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి అండ గా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవా ధ్యక్షులు లగడపాటి రమేష్ చంద్, లయన్స్ క్లబ్ ట్రెజరర్ శ్రీశైలం జయకుమార్, క్లబ్ సభ్యులు రాజేష్, జబ్బు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన

**వలిగొండ, ఆగస్టు 14 (నినాదం):** మండలంలోని గోకారం ప్రభుత్వ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాలల రక్షణ, బాల్యవివాహాలపై, ఫోక్సో చట్టంపై బాలలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ మత్స్యగిరి మాట్లాడుతూ పిల్లల పైన లైంగిక వేధింపులు జరిగినట్లయితే ఫోక్సో చట్టం క్రింద కేసులు నమోదు చేస్తారని, సమాజంలో ప్రస్తుతం పిల్లల పైన అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నాయని వాటికి శిక్షలు కఠినంగా ఉన్నాయని అన్నారు. బాలకార్మికులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చెడు లక్షణాల వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్కోప్ సంస్థ ప్రతినిధి నరసింహ రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరిలో ఘనంగా తిరంగా యాత్ర

**కోదాడ,ఆగస్టు 13(నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకునీ బీజేపీ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చింతకుంట్ల సతీష్ ఆధ్వర్యంలో గోండ్రియాల శివాలయం నుంచి అనంతగిరి మండల కేంద్రం వరకు శుక్రవారం తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూనిన నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా తిరంగా యాత్ర కన్వీనర్ వెంకటేష్‌బాబు మాట్లాడుతూ.. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటడమే లక్ష్యంగా మండలంలోని పలు గ్రామాల్లో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాల్సిన



అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట నర్సయ్య, జిల్లా నాయకులు జిల్లా జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జల్లా అరుణ, వరయ్య, మండల నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రిన్సిపాల్ వి. వెంకటేషులు**

**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 14( నినాదం)** ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. వెంకటేషులు అన్నారు. శుక్రవారం భారత 80 వ స్వాతంత్ర దినోత్సవ ముందస్తు వేడుకలలో భాగంగా హర్ ఘ ర్ తిరంగా ర్యాలీని ఎన్ సి సి ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి నిర్వహించారు. అనంతరం కళాశాల పరిసర ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తమ గ్రామాలలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన




కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్లాస్టిక్ వినియోగించడం వలన వాతావరణ కాలుష్యం ఏర్పడి వర్షాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధు, ఎన్సిసి కోఆర్డినేటర్ నాగు నాయక్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**మోతె,ఆగస్టు 14(నినాదం):** కోదాడ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలు మోతె మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మల్లన్న జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మల్లన్నకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రజలకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సహకారం, నాయకులు--కార్యకర్తలకు అందిస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమని అన్నారు. మల్లన్నకు భవిష్యత్తులో మరింత ఉన్నతమైన రాజకీయ అవకాశాలు లభించాలని,



ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లిఆరె లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్ రెడ్డి, నూకల శ్రీనివాస్ రెడ్డి, దేవుల నాయక్ యూత్ అధ్యక్షులు జానీ పాషా, యుగంధర్ రెడ్డి, గంగులు, కాంపాటి వెంకన్న, రవిపహాడ్ సర్పంచ్ కోడి లింగయ్య,బానోత్ దేవ్లా, ఇండ్ల వెంకటేశ్వర్లు, కాకి సురేందర్ రెడ్డి, నాగయ్య, వేణు, దిలీప్, రవీంద్రచారి, చింతలపాటి రవి రాముడు, కమలాకర్, నవీన్, నరేష్, దుర్గయ్యలి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- **పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే. ప్రసాద్**
- **సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి**

**కొత్తగూడెం, ఆగస్టు 14(నినాదం)** ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీజీ డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని కోరింది. పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు, రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆశ్రమ, గురుకుల, సింగరేణి, కేజీబీవీ



ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, 398 వేతనంతో పనిచేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరింది. అదేవిధంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పేర్కొంది. ఈ డిమాండ్ల సాధన కోసం పీఆర్‌టీయూ టీజీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 7:30 గంటలకు విద్యానగర్ కాలనీ నుంచి రైల్వే స్టేషన్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే. ప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రెండు వేర్వేరు ఘటనల్లో ఐదుగురు వ్యక్తులు అరెస్ట్

**కమలాపూర్,ఆగస్టు 14 (నినాదం)** రెండు వేర్వేరు కేసుల్లో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్ కు తరలించినట్లు స్థానిక సిఐ పి నవీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కమలాపూర్, గూడూరు గ్రామాల్లో జరిగిన రెండు వేర్వేరు దాడి ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి రీమాండ్‌కు తరలించామన్నారు. కమలాపూర్ గ్రామానికి చెందిన కంది రమేష్, భార్య కంది శృతితో తన స్వంత అన్న అయినా కంది శ్రీనివాస్ పై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనకు సంబంధించిన నమోదైన కేసులో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిదంగా గూడూరు గ్రామానికి చెందిన చిలుముల బాబు, వంశీ , అరవిందలు కలిసి అదే గ్రామానికి చెందిన గాజుల సురేష్ పై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా వ్యక్తులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇతరులపై దాడులకు పాల్పడినట్లయితే, అట్టి వ్యక్తులపై ఎటువంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నేరం రుజువైన మేరకు సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, ఏవైనా వివాదాలు ఏర్పడినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సి ఐ నవీన్ సూచించారు.



## ఆరుతడి పంటలపై అవగాహన సదస్సు

**కమలాపూర్, ఆగస్టు 14 (నినాదం)** మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వేణు మాట్లాడుతూ ఎలినో ప్రభా వంతో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు కంది, పెసర ,మినుము ,కూరగాయలు ,ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొనటువంటి రైతులను తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రీ ని చేసుకోవాలని తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న టువంటి రైతులకు మాత్రమే ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీలను పొందడానికి వీలుగా ఉంటుందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సమృద్ధిగా వర్షాలు కురవాలని ముస్లిం సోదరుల ప్రత్యేక దువా

**హుజూర్‌నగర్, ఆగస్టు 14 (నినాదం ):** తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ హుజూర్‌నగర్‌లోని ఉస్మానియా మసీదులో ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక దువా నిర్వహించారు. ముస్లింల మతపెద్ద ముఫ్తీ మొహమ్మద్ గౌస్ ఉద్దీన్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ముఫ్తీ మొహమ్మద్ గౌస్ ఉద్దీన్ మాట్లాడుతూ అల్లా దయతో తెలంగాణతో పాటు కృష్ణా, గోదావరి ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు తెలిపారు. నదులు పరవళ్లు తొక్కి ప్రాజెక్టులు, జలాశయాలు నిండాలని, ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటికి ఎలాంటి కొరత లేకుండా ఉండాలని ఆకాంక్షించారు. రైతులు ఆనందంగా పంటలు సాగు చేసుకోవాలని, రైతు కూలీలు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వ్యాపార రంగం అభివృద్ధి చెందాలని అల్లాను వేడుకున్నా రు. తెలంగాణ అంతటా మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి. అజీజ్ పాషా, ఎస్.కె. మన్సూర్ అలీ, జావిద్ భాయ్, సయ్యద్ అశ్రాఫ్ అలీ, మిల్లురహీం భాయ్, ఖాజీ ఖయ్యూమ్ భాయ్, ఎండి. లతీఫ్ భాయ్, ఎస్.కె. ఖాదర్ సాబ్, ఎండి. ఫర్వేజ్, ఎండి. సోయల్, ఎస్.కె. భాష, రఫీ, నాగుల్, అబ్బాసాలి, జానీ మియా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లపై అప్రమత్తంగా ఉండాలి

## వ్యాపారులకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి సూచన

**హుజుర్నగర్ , ఆగస్టు 14 (నినాదం ):**

నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరుతో వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా జోనల్ అధికారిణి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి సూచించారు.

ఆమె ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు హుజూర్‌నగర్ పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలను పరిశీలించారు. నిబంధ నలకు విరుద్ధంగా విక్రయిస్తున్న అనుమానా స్పద రంగులు కలిగిన పప్పులు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ప్రభుత్వం నిషేధించిన పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలు, హోటళ్ల నుంచి అనుమానాస్పద ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రతి చిన్న, పెద్ద ఆహార వ్యాపారి, హోటల్ నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అధికారుల వద్ద లైసెన్స్



లేదా రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగుల ఆహార పదార్థాలు, లూజ్ టీ పొడి, లూజ్ నూనెలు, గడువు ముగిసిన వస్తువులను విక్రయించరాదన్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఐడీ కార్డు చూసి ధృవీకరించుకోవాలి**

ఇటీవల కొంతమంది తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ వ్యాపారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులను పిలిపించి



అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి విచారణ జరిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు వారి గుర్తింపు కార్డును తప్పనిసరిగా అడిగి ధృవీకరించుకోవాలని సూచించారు. నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఇచ్చే లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. ఎవరైనా నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వచ్చి బెదిరింపులకు పాల్పడినా, డబ్బులు డిమాండ్ చేసినా వ్యాపారులు భయపడకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలని వి. జ్యోతిర్మయి కోరారు. తనిఖీల్లో స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులు బి. ప్రభాకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ అలసత్వంతో రగిలిన ‘ఆళ్ళపల్లి’!

## రూ. కోట్ల విలువైన 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ

- **తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**
- **నేడు ఆఆర్‌డీవో వద్ద పంచాయితీ**



**ఆళ్ళపల్లి (భద్రాద్రి కొత్తగూడెం):**

అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడమే మూలంగా ఆళ్ళపల్లి మండల కేంద్రం లో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. సర్వే నంబర్ 484లోని ప్రభుత్వ భూమి ఆక్రమ ణకు గురవుతోందని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ శాఖ కనీస చర్యలు తీసుకోకపోవ డంతో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ పూరి త వాతావరణం ఏర్పడింది. చివరకు అధికా రుల రంగప్రవేశం, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, తహసీ ల్దార్ కార్యాలయం ముట్టడితో ఆళ్ళపల్లి మండల కేంద్రం తీవ్ర ఉద్రిక్తతల నడుమ అట్టుడికింది.

**ప్రభుత్వ స్థలంలో కంచె... వివాదానికి అసలు కారణం**

ఆళ్ళపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 484లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇటీవల ఒక వ్యక్తి దాదాపు రెండు ఎకరాల మేర చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో ఈ వివాదం మొదలైంది. 1977లో నాటి ప్రభుత్వం 47 మంది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల కోసం రెండేసి గుంటల చొప్పున ఈ భూమిని కేటాయించిందని ఒక వర్గం స్పష్టం చేస్తోంది. గతంలో ఇక్కడ ఎస్సీ కాలనీ ఉండేదని, నేటికీ దేవుని గుడి, రెండు ఇళ్లు, పూర్వీకుల సమాధులు ఉన్నాయని వారు తెలిపారు.




నీటి వసతి లేక ప్రస్తుత ఎస్సీ కాలనీకి వలస వెళ్లామని, ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్రశ్నిస్తే అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, ఇది తమకు వారసత్వంగా సంక్రమించిన పట్టా భూమి అని ఎదుటి వర్గం వాదిస్తోంది. గత మూడు నెలలుగా ఇరువర్గాలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ అధికారులు సమస్యను తేల్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వివాదం ముదిరి శాంతిభద్రతల సమస్యగా మారింది.

**తహసీల్దార్ ఆఫీస్ ముట్టడి... హెచ్చరిక బోర్డు ఏర్పాటు**

పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో ఆలస్యంగా అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి, అది ప్రభుత్వ భూమేనని స్పష్టం చేస్తూ అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అధికారుల ఈ హడావుడి చర్యపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు, ఇన్ని రోజులు పట్టించుకోకుండా ఇప్పుడు బోర్డులు పెట్టడమేంటని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలంటూ పెద్ద సంఖ్యలో బాధితులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తీవ్ర స్థాయిలో ధర్నా నిర్వహించారు. దీంతో కార్యాలయ ప్రాంగణంలో కాసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ఆర్‌డీవో కోర్టుకు చేరిన పంచాయితీ**

ధర్నా వార్త తెలుసుకున్న తహసీల్దార్ గడ్డం ఉమారాణి బాధితులతో మాట్లాడి ఇరుపక్షాల వాదనలను విన్నారు. సమస్య సంక్లిష్టతను దృష్ట్యా విషయాన్ని కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో) దృష్టికి తీసుకెళ్లారు. శనివారం జిల్లా రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించే విచారణకు ఇరువర్గాలు హాజరుకావాలని ఆఆర్‌డీవో ఆదేశించడంతో బాధితులు తాత్కాలికంగా ధర్నాను విరమించారు.

**వెలుగులోకి దిగ్భ్రాంతికర నిజాలు: 90 ఎకరాల ఆక్రమణ!**

ఈ వివాదం సృష్టించిన కలకలంతో ఆళ్ళపల్లి పరిధిలో జరుగుతున్న భూ ఆక్రమణల గుట్టు రట్టయింది. సర్వే నంబర్ 484 పరిధిలోనే సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, అందులో దాదాపు 70శాతంకి పైగా అక్రమ నిర్మాణాలు లేదా ఇళ్లు వెలిశాయని తహసీల్దార్ వెల్లడించారు. రాబోయే రెండు రోజుల్లో భూ ఆక్రమణదారులందరికీ చట్టబద్ధమైన నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించకుండా పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖలు కూడా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## ‘ఏఎమ్‌డీఆర్’కు ఏ పార్టీతో సంబంధం లేదు

### ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏఎండీ ఆదిల్



**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 14 (నినాదం):**

తాను ఏర్పాటు చేసిన ఏఎన్‌డీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ చేంజ్కు ఏ రాజకీయ పార్టీతోనూ ఎలాంటి సంబంధం లేదని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏఎండీ ఆదిల్ స్పష్టం చేశారు. శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, విద్యార్థులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు, చదువులో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం లేక వెనుకబడుతున్న విద్యార్థులు, రవాణా సౌకర్యం లేక చదువుకు దూరమవుతున్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా వర్గాలకు అవగాహన కల్పిస్తూ విద్య, స్వయం ఉపాధి, సామాజిక అభివృద్ధి రంగాల్లో తమవంతు సహకారం అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. తమ సంస్థ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను చూసి కొంతమంది ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారంటూ దుష్ప్రచారం చేయడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా తమ ఫౌండేషన్‌కు ఒక్క రూపాయి ఆర్థిక సహాయం కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. ఏఎన్‌డీ ఆర్ ఫౌండేషన్ పూర్తిగా సొంత నిధులతోనే నడుస్తోం దని, ఏ పార్టీ నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం కోరడం లేదని, ఎవరి నుంచి నిధులు వసూలు చేయడం లేదని ఆయన వెల్లడించారు. తమ సేవా కార్యక్రమాలపై అనవస రమైన రాజకీయ రంగు పులమకుండా వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.



## గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులు అరెస్ట్

**సత్తుపల్లి,ఆగస్టు 14(నినాదం )**

ఒడిశా నుంచి హైదరాబాద్ కు గంజాయి కారులో అక్రమ రవాణా జరుగుతుందనే విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీమ్, సత్తుపల్లి పోలీస్ సిబ్బంది సత్తుపల్లిలో సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీలో కారులో అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోని విచారించాగా కోరాపుట్, ఒడిశా రాష్ట్రం కు చెందిన కామేష్ మారి, కారా రాజేంద్ర గా గుర్తించి వారి నుండి సుమారు మూడు లక్షల కు పైగా విలువ చేసే 6 కేజీల 360 గ్రాముల గంజాయి ని, 2 మొబైల్ ఫోన్లు,ఒక 110 కారు ను సీజ్ చేయడం జరిగిందని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపారు.దర్యాప్తులో భాగంగా నిందితులపై ఎన్డీపిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.




## సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14(నినాదం)**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను యావత్ దేశ ప్రజలు ఐక్యమై తిప్పి కొట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం డి ఇమ్రాన్ అన్నారు. భువనగిరి లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతను జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, గన బోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, పుట్ట రమేష్, ముంతాజ్ బేగం, రచ్చ మోహన్ దాస్, ఉమేష్, మల్లేష్, శ్రీను, నరసింహ, జగన్, రాజు, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా నాణ్యమైన

# వైద్య సేవలు అందేలా పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14(నినాదం )**

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు డాక్టర్లు సిబ్బంది అందేలా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. శుక్రవారం యాదగిరిగుట్ట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పరీక్షలు, ప్రసూతి సేవలు, భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భం గా పీహెచ్‌సీకి విధులకు సంబంధించిన సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా, ఎవరైనా గైర్హాజర య్యారా అని కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్ లో (ఆబా) లో కూడా నమోదైన వివరాలు పరిశీలించారు. సిబ్బంది మీ ప్రమాణం యాప్‌లో రోజువారీ హాజరు నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. విధులకు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి రోజు పీహెచ్‌సీలో రోజువారీగా ఎంతమంది రోగులు ఓపీకి వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు., ఓపీకి వచ్చిన ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఫార్మసిస్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మందుల నిల్వలు, పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో అందుబాటులో లేని పరీక్షలకు సంబంధించిన నమూనాలను ఏ ల్యాబ్‌కు పంపిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. ప్రతి నెల ఆసుపత్రి లో ఎన్ని డెలివరీ జరిగినవి అని , గత నెల, ఈ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగియని, వాటిలో హైరిస్క్ గర్భిణులు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, మిగిలిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి మనోహర్, డాక్టర్లు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## చేనేత కార్మికులకు ఆసరా పెన్షన్ లు మంజూరు చేయాలి

**వలిగొండ, ఆగస్టు 14 (నినాదం):**

అర్హత గల ప్రతి చేనేత కార్మికునికి ఆసరా ఫెన్షన్ మంజూరు చేయాలని చేనేత సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకట్ నర్సు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరుకు పోయిన క్యాష్ క్రెడిట్ అప్పులను రద్దు చేయాలని, అర్హత గల ప్రతి కార్మికునికి నూతన ఫెన్షన్ మంజూరు చేయాలని, చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం చేనేత బట్టలపై జీఎస్టి విధించి చేనేతను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్దాసు నర్సింహా, పున్న వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలు

**సత్తుపల్లి, ఆగస్టు 14 (నినాదం)**

సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ చైర్మన్ శ్రీ జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలను సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీ మట్టా దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్‌కు ఆయురారోగ్యాలు, అష్టైశ్వ ర్యాలు, సుఖసంతోషాలు ఎల్లప్పుడూ కలగా లని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి టౌన్ ప్రెసిడెంట్ గాదే చెన్నారావు, వేంసూర్ సర్పంచ్ ఫక్రుద్దీన్, కాంగ్రెస్ నాయ కులు మట్టా చెన్నారావు, బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ పొట్టి కిరణ్, బ్రాంచ్ చీఫ్ ఆర్గనై జింగ్ సెక్రటరీ షాట్రాక్ బాబు, జేవీఆర్ సిఎస్‌పి ఫిట్ సెక్రటరీ నగేష్, ఇక్బాల్, కే. శ్రీధర్, అశోక్, శ్రీకాంత్, సది, శ్రీధర్, చంద్రశే ఖర్, డిఎల్‌ఆర్ ఇంచార్జ్ సుభాని తదితర కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు, అభిమానులు పాల్గొని జనక్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# చైతన్యాన్ని నింపిన తిరంగా యాత్ర

**మధిర ఆగస్టు 14 (నినాదం):**

భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారత దేశ ఔన్నత్యాన్ని, త్రివిధ దళాల శక్తి సామర్థ్యాలను, దేశ సంస్కృతి సంప్రదాయాలను తెలియచేసేలా వందేమాతరం నినాదంతో త్రివర్ణ పతాకాలను చేత పట్టుకొని, గుండెల నిండా దేశభక్తిని నింపుకొని, మధిర పట్టణంలో కొనసాగిన తరంగాయాత్ర ప్రజలలో చైతన్యాన్ని నింపింది. భారతీయ జనతా పార్టీ మధిర మండల, పట్టణ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ చైతన్య కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్, మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని భరత్ ఈ టెక్నో స్కూల్, నారాయణ టెక్నో స్కూల్, జీవి అకాడమీ, విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, నాయకులు, ముఖ్యఅతిథిగా మందడపు సుబ్బారావు, ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పెరుమాళ్ళపల్లి విజయరాజు, జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మధిర నియోజకవర్గం కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, ఎస్సీ



మోర్చా రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ జాయింట్ కన్వీనర్ మర్సకట్ల స్వర్ణాకర్, జిల్లా నాయకులు చిలువేరు సాంబశివరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు పాపట్ల రమేష్, దుద్దుకురి కార్తీక్, మండల పదాధికారులు పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, దోర్నాల రవీంద్ర, గడ్డం భవాని, కనకపుడి రమేష్, గౌసుద్దీన్, బొడ్డు మాధవ సాయి, యువ మోర్చా మండల నాయకులు మాదిరాజు సాయిరాం, టౌన్ ప్రధాన కార్యదర్శి బియ్యవరపు రామకృష్ణ, నాయకులు పగడాల నాగేంద్రబాబు, చక్రవర్తుల వరదరాజన్, బొడ్డు రామకృష్ణ, నాగరాజు, పి కాజామీయా, తదితరులు పాల్గొనడం జరిగింది.



# న్యాయవాదులపై దాడులు సరికాదు

**తొర్రూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన**

**తొర్రూరు, ఆగస్టు 14 (నినాదం న్యూస్):**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో నాగర్ కర్నూల్ జిల్లా సీనియర్ న్యాయవాది ఎం. వేణుగోపాలరావు పై కక్షి దారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ తొర్రూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరత్నం మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు చేయడం సరికాదని, దాడికి పాల్పడిన వారి తరపున న్యాయవాదులు ఎవరూ వాదించవద్దని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. న్యాయవాదుల సంరక్షణ చట్టం ప్రకారం న్యాయవాదులపై ఎవరైనా దాడికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, ట్రెజరర్ ఉపావతి, న్యాయవాదులు రఘురామ్ రెడ్డి, వలపు మధుసూదన్, ప్రవీణ్ రాజు, బి .వెంకన్న, శ్రీధర్, విజయ, గణపురం రామకృష్ణ, అశోక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## నందం వెంకటేశ్వరరావును పరామర్శించిన టిజిఐడిసి చైర్మన్ మువ్వా

**పెనుబల్లి, ఆగస్టు 14 (నినాదం)**

పెనుబల్లి మండలం మండలపాడు గ్రామానికి చెందిన నందం వెంకటేశ్వరరావు (శేషయ్య కుమారుడు) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టిజిఐడిసి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌ. శ్రీ మువ్వా విజయబాబు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మువ్వా విజయబాబు, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మువ్వా విజయబాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మధ్య పుట్టినరోజు.. ఆత్మీయత చాటుకున్న మల్లయ్య...

**తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న మల్లయ్య**

**హాస్టల్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సూచనలు**



**కోదాడ,ఆగస్టు 14(నినాదం):**

కోదాడ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలను విద్యార్థుల సమక్షంలో ఆత్మీయంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, అల్పాహారం సేవించారు. అనం తరం విద్యార్థులతో మమేకమై వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. తాను కూడా చిలుకూరు గ్రామంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉండి చదువుకుని ఉన్నత స్థాయికి వచ్చానని గుర్తుచేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడి, మానవతా విలువలను అలవర్చుకోవాలని సూచించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని, వారి చిరునవ్వులే తనకు నిజమైన జన్మదిన కానుక అని పేర్కొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆక్సిజన్ మిషన్ అందజేత

**ఆలేరు, ఆగస్టు 14(నినాదం):**

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు అత్యవసరంగా అవసరమైన ఆక్సిజన్ మిషన్‌ను బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన తంద్ర పరుశురాములు సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఆయన సతీమణి బీర్ల అనిత మానవతా దృక్పథంతో స్పందించారు. మహిళ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నిరంతరం ఆక్సిజన్ అవసరమని తెలుసుకున్న బీర్ల అనిత, సుమారు రూ.25 వేల విలువైన ఆక్సిజన్ మిషన్‌ను ఆమె కుటుంబానికి అందజేశారు. దీంతో అత్యవసర సమయంలో అవసరమైన పరికరం అందుబాటులోకి రావడంతో కుటుంబ సభ్యులు ఊరట చెందారు.

**ఆపదలో అండగా నిలవడమే లక్ష్యం**

ఈ సందర్భంగా బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ వారి కష్టాల్లో భాగస్వామ్యం కావాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎప్పుడు, ఎక్కడ ఆపద వచ్చినా వీలైనంత మేరకు సహాయం అందించేందుకు బీర్ల ఫౌండేషన్ ముందుంటుందని పేర్కొన్నారు.

**కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

పరుశురాములు మాట్లాడుతూ తన సతీమణి అనారోగ్య పరిస్థితిని తెలుసుకుని అత్యవసరమైన ఆక్సిజన్ మిషన్‌ను అందించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, బీర్ల అనితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబానికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని, కష్ట సమయంలో అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో స్పందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీర్ల ఫౌండేషన్‌ను పలువురు అభినందించారు.

# ఆకట్టుకున్న సైనిక శిక్షణ విన్యాసాలు

**హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**ఆలేరు, ఆగస్టు 14(నినాదం):**
దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా యువతకు అందిస్తున్న సైనిక శిక్షణ అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బొమ్మలరామారం మండలం రంగాపూర్ గ్రామ సమీపంలోని హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం నిర్వహించిన తిరంగా ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన గౌరవ వందనాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వీకరించారు. అనంతరం విద్యార్థులు సైనిక శిక్షణలో భాగంగా నిర్వహించిన కవాతు, వివిధ విన్యాసాలు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణకు సంబంధించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైన్యంలో జవాన్లు శిక్షణ పొందే విధానాన్ని తలపించేలా విద్యార్థులు ఉత్సాహంగా,



సమన్వయంతో నిర్వహించిన విన్యాసాలను ఎమ్మెల్యే ఆసక్తిగా పరిశీలించారు. దేశ రక్షణలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో విద్యార్థులు పొందుతున్న శిక్షణను ఆయన అభినందించారు.

**యువత దేశ సేవ వైపు అడుగులు వేయాలి**

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యువతలో చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మవిశ్వాసం, సేవా భావం పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొంది, భవిష్యత్తులో సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలని కలలు కంటున్న యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవన విధానం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు అందిస్తున్న సైనిక శిక్షణ, వసతులు, శిక్షణా విధానం తదితర వివరాలను ఎమ్మెల్యే నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి వారి లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ..

**క్యూస్పైడర్ క్యాంపస్ నియామకాల్లో 47 మందికి ఉద్యోగాలు**

**సత్తుపల్లి, ఆగస్టు 14, ( నినాదం)**
సత్తుపల్లి మండలం బి. గంగారంలో ఉన్న సాయిస్ఫూర్తి స్వయంప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థ క్యూస్పైడర్, హైదరాబాద్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ప్రతిభ కనబరిచారు. సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 47 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి శిక్షణ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ విభాగాలకు చెందిన 126 మంది విద్యార్థులు ఈ నియామక ప్రక్రియకు హాజరయ్యారు. సంస్థ ప్రతినిధులు నిర్వహించిన రాత పరీక్ష, సాంకేతిక పరీక్ష, మానవ వనరుల విభాగం పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూ తదితర దశల్లో విద్యార్థుల ప్రతిభను పరిశీలించి 47 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి 16 మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం నుంచి 15 మంది, కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ విభాగం నుంచి 16 మంది ఉన్నారని కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం పూర్తి చేసిన అనంతరం ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లో ఉద్యోగాల్లో చేరాల్సి



ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల విద్యా నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న అంశాలపై అవగాహనను పరిశీలించిన అనంతరం క్యూస్పైడర్ సంస్థ ప్రతినిధులు వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు చెప్పారు. క్యూస్పైడర్ సంస్థ సాంకేతిక విభాగం నాయకురాలు ప్రియదర్శిని, మానవ వనరుల విభాగం సీనియర్ మేనేజర్ కె. చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి శిక్షణ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త, హెటిరో ఔషధ సంస్థ అధినేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన విద్యా ట్రస్టీ బండి అన్విద వర్చువల్ విధానంలో విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యాంశాల పరిజ్ఞానం మాత్రమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న నేపథ్యంలో ఉద్యోగ మార్కెట్‌లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, విద్యార్థులు నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ ఉండాలని సూచించారు. ప్రాంగణ నియామకాలకు ముందుగానే సన్నద్ధమై తమ ప్రతిభను నిరూపించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, శిక్షణ మరియు నియామకాల అధికారి డాక్టర్ డి.ఎన్.వి. కృష్ణారెడ్డి, అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, విభాగాల నియామకాల బాధ్యులు, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# చుంచుపల్లి మండలంలో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి

**23 శాఖల అధికారులతో ప్రజలకు నేరుగా సమస్యల పరిష్కారానికి అవకాశం**

**చుంచుపల్లి, ఆగస్టు 14(నినాదం)**
ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్3, 4 మార్గదర్శకాల మేరకు చుంచుపల్లి మండలంలో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో కార్యాలయం)లో ప్రజావాణి నిర్వహించబడు తుంది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ప్రజల నుంచి




స్వీకరించిన ఫిర్యాదులు, వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటి పరిష్కారంపై సమన్వయం చేస్తారు.

**23 శాఖల అధికారులు హాజరు**

మండల పరిధిలోని 23 ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రతి సోమవారం ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తారు. సమస్యలను పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఒకే వేదికపై సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించే అవకాశం ప్రజావాణి ద్వారా కల్పించబడుతోంది. ఆధారాలతో వినతిపత్రాలు సమర్పించాలి ప్రజలు తమ సమస్యకు సంబంధించిన వినతిపత్రంతో పాటు అవసరమైన ఆధారాలు, సంబంధిత పత్రాల ప్రతులను తీసుకువచ్చి ప్రజావాణిలో సమర్పించాలని అధికారులు సూచించారు.“ప్రజల సమస్యలు – అధికారుల దృష్టికి, సమస్యలకు సత్వర పరిష్కారం – ప్రజల ముంగిట” అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని చుంచుపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వీణా కోరారు.



## యాదగిరిపల్లి పందిళ్ళపల్లి చెరువుకు ఫీడల్ ఛానల్ ఏర్పాటు చేయాలి

**మిర్యాలగూడ ఆగస్టు 14 (నినాదం):**
యాదగిరి పల్లి పన్నులపల్లి చెరువుకు వీడోస్ ఛానల్ లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వరు అన్నారు . శు క్రవారంతెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కి మెమోరండం ఇచ్చారు. మాట్లాడుతూ యాద్గారి పెల్లి పందిళ్ళపల్లి చెరువు లో రోజు రోజుకు నీటిమట్టం తగ్గిపోతున్నాయి . దాని వలన చుట్టూ ప్రక్కల గ్రామాలు ఎటు 10 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతా ఉన్నాయని వారన్నారు దానితోపాటు ఇండ్లలో ఉన్న బోర్లు కూడా పొలాల్లో ఉన్న బోర్లు నీరు తగ్గడం వలన బోర్లు ఆగి ఆగి నీరు పోస్తున్నాయని వారన్నారు యాదగిరి పెల్లి పందిళ్ళపల్లి చెరువుకు నాగర్జున సాగర్ ఎడమ కాలువకు గతంలో ఏడు కోట్ల తండా పక్కనుండి సాగునీరు వచ్చేటప్పుడు ఆ చెరువు నిండేదని ఇవ్వాళ ఆ ప్రాంతం మొత్తం రియల్ ఎస్టేట్ చేసి వ్యవసాయ భూములు మొత్తం ఇల్లు నిర్మించుకున్నారని రామచంద్ర గూడెం చైతన్య నగర్ రామ్ నగర్ తాళ్లగడ్డ ఈ వ్యవసాయ భూములు మొత్తం ఇండ్లుగా మారిపోయినాయి ఇప్పుడు అక్కడ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేదు కాబట్టి నేరుగా సాగర్ ఎడమకాల ద్వారా యాద్గారి పెల్లి పందిళ్ల పెల్లి చెరువుకు ఫీడల్ చానల్ ఏర్పాటు చేసి అన్ని చెరువులతోపాటు ఈ చెరువును కూడా నింపవల సిన అధికారుల పైన ఉందని వారన్నారు 20.రోజుల క్రితం తాగునీరు కోసం పాలేరు చెరువు నింపుటకు క్రిందికి నీటిని తీసుకొని పోయినారు . లీడర్ ఛానల్ ఉంటే చెరువు నింపే నింపేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి యువజన సమాఖ్య నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు. బస్కర్ల పరమేష్ ఆకారపులోకేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్ మట్టయ్య రాములు శ్రీనివాసు లింగయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు




## మారుపేరు కార్మికుల సమస్య పరిష్కరించాలి: జె. సీతారామయ్య

**కొత్తగూడెం, ఆగస్టు 14:(నినాదం)**
మారుపేరు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులతో దీక్ష విరమింపజేయాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్--ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.కొత్తగూడెం హెడ్ ఆఫీస్ సెంటర్‌లో గత మూడు రోజులుగా మారుపేరు కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగినట్లు తెలిపారు.రైటర్ బస్తీలోని కొత్తగూడెం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ, మారుపేరు కార్మికుల సమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. సమస్య పరిష్కారం కోసం కార్మికులు అనేక ఆందోళనలు నిర్వహించి, అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.గతంలో భట్టి విక్రమార్కను కలిసినప్పుడు సమస్య పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేసి, అన్ని యూనియన్లతో చర్చిస్తామని హామీ ఇచ్చారని, అయితే సంవత్సరాలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. విజిలెన్స్ అధికారులు కూడా సమస్యను పరిష్కరించాలని సూచించినప్పటికీ సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.సమస్య కారణంగా మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మారుపేరు కార్మికుల్లో ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు మృతి చెందారని సీతారామయ్య తెలిపారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు ఎలాంటి హాని కలగకుండా పోలీసులు, ఎస్ఎన్‌పీసీ, ఇంటెలిజెన్స్ అధికారులు వ్యవహరించాలని కోరారు. తక్షణమే సమస్యను పరిష్కరించి ఆమరణ నిరాహార దీక్షను విరమింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఐఎఫ్ టీయూ నాయకులు ఎన్. సంజీవ్, గౌని నాగేశ్వరరావు, మోత్కూరి మల్లికార్జునరావు, కరుణ, రాజేశ్వరి, సంజీవరావు, కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

